ఆరంభం అదిరింది..

- ఆత్మీయంగా పలకరిస్తూ.. అభ్యర్థిని పరిచయం చేస్తూ
- అంబర్‌పేటలో మాజీ మంత్రి కేటీఆర్ పర్యటనకు అపూర్వ స్పందన
- సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి పజ్జన్న ప్రచార పర్వం షురూ
- అడుగడుగునా మంగళ హారతులు, పూల వర్షంతో స్వాగతం

చిన్నారితో.. కేటీఆర్


కార్యకర్తను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గోల్నాక, అంబర్‌పేట, మార్చి 31 : సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి అంబర్‌పేటలో ప్రారంభించిన తన ఎన్నికల ప్రచార పర్వం ఆరంభం అదిరింది. ఆదివారం అంబర్ పేట డివిజన్ ప్రేమ్ నగర్‌లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో పద్మారావు గౌడ్ తన ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రచార ఆరంభ కార్యక్రమానికి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో పాటు వందలాది బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కేటీఆర్ ప్రేమ్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేటీఆర్ ప్రచారానికి మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావును పరిచయం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కేటీఆర్ అభ్యర్థించారు.

ప్రజలతో మమేకమై..

ప్రేమ్‌నగర్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలసి ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్ అక్కడి ప్రజలతో మమేకమయ్యారు. మీరు ఏ పని చేస్తారు..? పిల్లలు ఏం చదువుతున్నారు..? అంటూ వారి యోగక్షేమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సారు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చారని కొందరు.. దళితబంధు పథకంతో దర్జాగా బతుకుతున్నామని ఇంకొందరు.. బీసీ బంధుతో ఉపాధి పొందుతున్నామని మరి కొందరు తెలుపగా కేటీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.

రంజాన్ శుభాకాంక్షలు ..

ప్రేమ్‌నగర్‌లో అధికంగా ఉన్న ముస్లిం సోదరులు, మహిళలు కేటీఆర్‌కు అపూర్వ స్వాగతం పలికారు. మంచినీరు అందిస్తూ మర్యాద చేశారు. కేటీఆర్ ' కై సా హై భాయ్.. కై సా హై ' అమ్మా అంటూ పలకరిస్తూ ' ఓట్ కిస్కు దాల్ రే ' అంటూ ప్రశ్నించారు. హమరా ఓట్ కేసీఆర్ సాబ్ కు అంటూ వాళ్లు బదులిచ్చారు. కేసీఆర్ సాబ్ కా నిషాన్ క్యాహై అంటూ ప్రశ్నించగా.. కార్ అంటూ నినాదాలు చేశారు. కేటీఆర్ ముస్లిం సోదరులకు ముందుస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సెల్ఫీ కోసం ఎగబడ్డ స్థానికులు

ప్రేమ్ నగర్ పాదయాత్రలో స్థానికులు కేటీఆర్‌తో ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు. దీంతో జనాన్ని కేటీఆర్ సెక్యూరిటీ సిబ్బంది కంట్రోల్ చేయలేక పోయారు. దీంతో కొన్ని సందర్భాల్లో తొక్కిసలాట జరిగినంత పనైంది. కేటీఆర్ పర్యటన షెడ్యూల్ ఉన్నా స్థానిక పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలు వినిపించాయి. చివరి నిమిషంతో అక్కడికి చేరుకున్ను నలుగురు పోలీసులు ఇంత జరుగుతున్నా పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ తదితరులతో పాటు నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, కార్యర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

కాచిగూడ, మార్చి 31 : వేసవిలో చిన్నారులకు నృత్యం, లలిత సంగీతం, నటన, చిత్రలేఖనం అంశాల్లో నారాయణగూడ బాలనందం భవన్‌లో మే 1 నుంచి మే 31 వరకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బాలనంద సంఘం అధ్యక్షురాలు జేవీ కామేశ్వరి తెలిపారు. తరగతులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఉంటాయని, ఆసక్తి గల వారు నేరుగా కార్యాలయంలో గాని, 040-2756 1443, www. balanandam. co.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందు పరుచవచ్చని ఆమె సూచించారు.

అభినందనలు

మాజీ హోం మంత్రి మహమూద్ అలీని ఆయన నివాసంలో హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ మార్యాదపూర్వకంగా కలిశారు. మహమూద్ అలీ ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. - అబిడ్స్, మార్చి 31

నేడు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఆత్మీయ సమావేశం

సుల్తాన్‌బజార్, మార్చి 31 : తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఆత్మీయ సమావేశాన్ని ఏప్రిల్ 1న నాంపల్లి గృహకల్ప ఆవరణలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ ఆదివారం తెలిపారు. సమావేశంలో కేంద్ర సంఘానికి ఆరోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన జ్ఞానేశ్వర్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ముఖ్యఅతిథులుగా టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, సహాధ్యక్షుడు బి.శ్యామ్, కోశాధికారి ఉపేందర్‌రెడ్డి, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి 33 జిల్లాల తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

దళితకవి ఇద్దాసుకు నివాళి

చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం తొలితరం దళితకవి దున్న ఇద్దాసు సంస్మరణ సభ జరిగింది. పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా విచ్చేసి ఇద్దాసు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయకుడు చింతలపూడి త్రినాథరావు, వినయ్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. - ముషీరాబాద్

నిజమైన కార్యకర్తలు బీఆర్ఎస్‌లోనే ..

ఉద్యమ సమయం నుంచి ఉన్న నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లోనే ఉన్నారని పార్టీ పటిష్టతకు పని చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు యాదశ్రీనివాస్ గుప్త అన్నారు. జియాగూడ డివిజన్‌లో పార్టీ పటిష్టతకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి డివిజన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కొందరు నాయకులు స్వార్థ రాజకీయాల కోసం పార్టీలో చేరి ఇపుడు పార్టీ వీడారని.. ఇలాంటి వారు తమ పార్టీలో లేకపోవడమే మంచిదని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మంతటి నర్సింలు, నరహరి చారి, మోహన్, రఘునాథ్, మంగి కిశోర్ కుమార్, వినోద్ కుమార్, మహేశ్ గౌడ్, మనోజ్ కుమార్, రాజేంద్ర కుమార్, ఓం ప్రకాశ్, వెంకటేశ్, నర్సింగ్ రావు, శివా, అనిత, అరుణ పాల్గొన్నారు. - కార్వాన్, మార్చి 31

పథకాలే గెలిపిస్తాయి

కాచిగూడ,మార్చి 31 : మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపిస్తాయిని బీఆర్ఎస్ నాయకుడు గోనె ప్రదీప్‌రావు అన్నారు. కాచిగూడలో పద్మారావుగౌడ్‌కు మద్దతు ప్రకటించి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి, పేదల కోసం పాటుపడే పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలను చిత్తుగా ఓడించి, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి, కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

బ్రాహ్మణ న్యాయవాదుల ఆత్మీయసదస్సు

పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న ప్రవచన కర్త,తత్వం చారిటబుల్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ, మాజీఎమ్మెల్సీ రామచందర్‌రావు

సుల్తాన్‌బజార్,మార్చి 31: న్యాయవాదులు కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకోవడం పూర్వజన్మ సుకృతమని ప్రవచన కర్త,తత్వం చారిటబుల్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో బ్రాహ్మణ న్యాయవాదుల ఆత్మీయ సదస్సునిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ..న్యాయవాదులు చట్టంలో వస్తున్న మార్పులను తెలుసుకుంటూ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు మాట్లాడుతూ.. అన్ని కోర్టుల్లో బ్రాహ్మణ న్యాయప్రముఖులు ఉన్నతస్థానంలో ఉండేవారని,ప్రస్తుతం సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. 80 మంది బ్రాహ్మణ న్యాయ ప్రముఖులను బ్రాహ్మణ న్యాయ శ్రేష్ఠ బిరుదుతో సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జస్టిస్ మఠం వెంకటరమణ, ఏబీ 6 చానల్ అధినేత విష్ణుదాస్ శ్రీకాంత్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాలశ్రీనివాసులు, రిటైర్డ్ జడ్జిలు కులకర్ణి కిషన్‌రావు, లక్ష్మీనారాయణ,ప్రభాకర్,నిరంజన్,లక్ష్మీకామేశ్వరి దీనావాహి, పీఎస్ సోమయాజులు,జి.సుజాత,లక్ష్మీవరప్రసాద్,వెంకటశేష ప్రభాకర్, చక్రవర్తి సుందరాచారి శ్రీధర్, జి.జయసింహారావు,సభ్యులు మోహన్‌కుమార్ గాంధీ,వెంకట కిషన్‌రావు,పావని శర్మ, అచ్యుత్ రామ శర్మ,సండేల్ చంద్రశేఖర్, సుఖేష్ శర్మ,గొల్లపల్లి ఫణీందర్, నేరళ్ల మల్లికార్జున్ రావు పాల్గొన్నారు.

కచ్‌భుజ్‌కు రైలుసౌకర్యం కల్పించాలి

గుజరాత్‌లోని కచ్ భుజ్‌కు నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిథేశ్ జాగిర్దార్ జైన్ కోరారు. ఆదివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని ఆయన జైన్ సమాజ్ సభ్యులు దినేశ్ గోసార్, దిలీప్ దాగాలతో కలిసి సమస్యలను విన్నవించారు. నగరంలో 5 లక్షలకు పైగా గుజరాతీలు ఉన్నారని, కచ్ భుజ్‌కు వెళ్లాలంటే రెండు, మూడు ట్రైన్లు మారాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా రైలు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

- సుల్తాన్‌బజార్, మార్చి 31

సన్మానం..

సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ కార్పొరేటర్లు మిత్రకృష్ణ, పరమేశ్వరిసింగ్ సీఎం నివాసంలో రోహిన్‌రెడ్డితో కలిసి వెళ్లి సీఎంను సన్మానించారు. కాంగ్రెస్‌లో చేరిన తాము ప్రభుత్వ పథకాలకు ప్రజలకు వివరిస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అత్యధిక పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

- అబిడ్స్, మార్చి 31

మహిళా మత్స్యకారుల అభివృద్ధికి కార్యాచరణ

మహిళా మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలంగాణ మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. ఆదివారం బోయిగూడ కమాన్‌లో మెట్టు సాయికుమార్‌కు మహిళా మత్స్యకారులు ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానించారు. - అబిడ్స్

హెబ్రోను చర్చిలో ఈస్టర్

గోల్కొండ చౌరస్తాలో బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన హెబ్రోన్ చర్చిలో పునరుత్థానం (ఈస్టర్) పురస్కరించుకుని ఆదివారం ప్రార్థనలు చేసి సువార్త ర్యాలీ నిర్వహించారు. హెబ్రోను దైవ సేవకులు బ్రదర్ ఎన్.జయరాజు, ఫ్రాన్సిస్ ఈస్టర్ సందేశాన్ని ఇచ్చారు. చర్చి సొసైటీ చైర్మన్ బ్రదర్ జోసెప్ పి.కురియన్, ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి పాల్గొన్నారు. - చిక్కడపల్లి, మార్చి 31

మద్యం బాటిళ్లు పట్టివేత

కాచిగూడ,మార్చి 31: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి. సుభాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌కు చెందిన రాములు కుమారుడు పిల్లి రాజేశ్ ఇంట్లో మద్యం అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని అతడి నుంచి 20 క్వార్టర్ బాటిళ్లు, 90 ఎంఎల్ 13 బాటిళ్లను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ,మార్చి 31: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపినవివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) ఆదివారం సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-3లో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు చొక్క, నీలి రంగు ప్యాంట్ ఉందని, ఎత్తు 5.6 ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

మాలలపై విషప్రచారం మానుకోవాలి

మాలలపై ఎమ్మార్పీఎస్ మాదిగ సంఘాలు విషప్రచారం మానుకోవాలని తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ..మాలల కన్నా మాదిగ జనాభా ఎక్కువ అంటూ, అసత్య ప్రచారం చేస్తున్నారని, మహార్ మాల బేగరి, మాల మార్టిటి ఆది ఆంధ్రామాల పేర్లతో ఎస్సీ జాబితాలో 23 మాల ఉపకులాలు ఉన్నాయన్నారు. బీజేపీ వంటి పార్టీలు వర్గీకరణకు మద్దతుగా నిలిచి మాలలకు వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. వర్గీకరణకు అనుకూలంగా ఉన్న పార్టీలను ఓడించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్. రాజు పిలుపునిచ్చారు. - రవీంద్రభారతి, మార్చి 31

రూ.85 కోట్లు దాటిన పన్నువసూలు


డీసీ విద్యాధర్, ఏఎంసీ శైలజకు చెక్కు అందజేస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి రాజేందర్, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్

అబిడ్స్, మార్చి 31: ఆస్తి పన్ను చెల్లింపునకు ఆదివారం చివరిరోజు కావడంతో జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయం పరిధిలో రూ. 85 కోట్లకు పైగా పన్ను వసూలైంది. ఉన్నతాధికారులు నిర్ణయించిన టార్గెట్‌ను అధికారులు పూర్తి చేయగలిగారు. సర్కిల్ కార్యాలయం పరిధిలోని పలు ప్రభుత్వ శాఖల భవనాలు, వ్యాపార, వాణిజ్య భవనాల యజమానులు పన్ను చెల్లించే విధంగా అధికారులు బృందాలుగా ఏర్పడి చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ విద్యాధర్ నేతృత్వంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ శైలజ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు వసూలులో నిమగ్నమయ్యారు. డీసీతో పాటు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఇతర విభాగ అధికారులు కార్యాలయం పరిధిలో తిరిగి పన్ను వసూలుకు చర్యలు చేపట్టారు. వీరితో పాటు కొందరు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నిక నేపథ్యం లో బిజీగా ఉన్నా శ్రద్ధ తీసుకుని టార్గెట్ ప్రకారం వసూలు చేయడంలో సఫలీకృతులయ్యారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ అధికారులు ఒక రోజే భారీ ఎత్తున వసూలు చేయగలిగారు. ఎగ్జిబిషన్ సొసైటీకి చెందిన ఆస్తి పన్ను బకాయి 77,98,935 రూపాయల చెక్కును డీసీ విద్యాధర్, ఏఎంసీ శైలజలకు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి ఏనుగుల రాజేందర్, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్ అందజేశారు.

జీహెచ్ఎంసీ సర్కిల్ -13లో..

జీహెచ్ఎంసీ సర్కిల్ -13 పరిధిలోని కార్వాన్‌లో ఆదివారం ఆస్తి పన్ను మొండి బకాయిలను వసూలు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తెలిపారు. ఆదివారం కార్వాన్ వార్డు కార్యాలయంలో పలు మొండి బకాయిలలో భాగంగా రూ.32, 20, 250 సంబంధించి చెక్, డబ్బులను తీసుకున్నామని డీసీ శశిరేఖ చెప్పారు.

- మెహిదీపట్నం, మార్చి 31

దానగుణం ఉన్న మనిషిలో దైవత్వం ఉంటుంది

దాన గుణం, నిబద్ధతతో జీవించే ప్రతి మనిషిలో దైవత్వం ఉంటుందని శ్రీ రామదూత స్వామి పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, దాంపత్యవ్రతం, వేణు దత్తాత్రేయ అభయమా మాలధారణ, దీక్షలను భగవాన్ శ్రీ రామదూత స్వామి ప్రారంభించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సతీ సమేతంగా పూజలు చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఈటెల రాజేందర్, దాసోజు శ్రవణ్‌కుమార్, బూడిద భిక్షమయ్య గౌడ్, ఎంఎన్ఆర్ గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్, పారిశ్రామిక వేత్తలు, ధార్మిక, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తరలి రాగా వారికి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. - అబిడ్స్, మార్చి 31

ఆధునిక శస్త్రచికిత్సలు నేర్చుకోవాలి

సదస్సును ప్రారంభిస్తున్న ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, దవాఖాన సూపరింటెండెంట్ శంకర్, ఫోరెన్సిక్ నిపుణులు టకీయుద్దీన్, ప్రొఫెసర్ లోక సుదర్శన్‌రెడ్డి

సుల్తాన్‌బజార్, మార్చి 31 : శస్త్ర చికిత్సల్లో అత్యాధునిక మెళుకువలను నేర్చుకోవాలని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం కోఠి ప్రభుత్వ ఈఎన్‌టీలో చెవి, ముక్కు, గొంతు వ్యాధుల ప్రభుత్వ దవాఖాన, ఫోరెన్సిక్, అనాటమీ ఉస్మానియా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో చెవిఎముక శస్త్ర చికిత్స ద్వారా పక్క నుంచి మెదడు, శిరస్సు కింది భాగంలో వ్యాధులు, గడ్డల శస్త్ర చికిత్సకు సంబంధించి శిక్షణ, అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ టి.శంకర్, సదస్సు సంచాలకులు డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, బెంగళూరుకు చెందిన ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ సంపత్‌చంద్ర ప్రసాదరావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చెవి, ముక్కు ,గొంతు వ్యాధులతో బాధపడుతూ వచ్చిన పేద రోగికి మెరుగైనసేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈఎన్‌టీ శస్త్ర చికిత్సల్లో అధునాతన పద్ధతులు నేర్చుకోవడానికి సదస్సులు యువ వైద్యులకు దోహదం చేస్తాయన్నారు. బెంగళూరుకు చెందిన నిపుణులు డాక్టర్ సంపత్ చంద్ర ప్రసాదరావు చెవి ఎముక శస్త్రచికిత్స, ఇతర శస్త్ర చికిత్సలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈఎన్‌టీ విభాగాధిపతి, సదస్సు సంచాలకులు డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ.. అత్యంత క్లిష్టమైన వ్యాధులను సమర్థవంతంగా నిర్మూలించడానికి ఈ పద్ధతులు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ దవాఖాన ప్రొఫెసర్ డాక్టర్ లోక సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ ఆనందాచార్య, ఫోరెన్సిక్ నిపుణులు డాక్టర్ తకీయుద్దీన్, అభిజిత్, అనాటమీ నిపుణులు డాక్టర్ సుమలత, వైద్యులు కరుణ, షావుల్ హామీద్, సత్యకిరణ్, 150 మంది శస్త్ర చికిత్స నిపుణులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రార్థనలకు ఇబ్బందులు కలుగకుండా చూడండి

రంజాన్ రోజు జరుపుకునే సామూహిక ప్రార్థనల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆదివారం ఎంపీతో సమావేశం అయ్యారు. ఇఫ్తార్‌పై చర్చించిన ఎంపీ మసీదులు, ఈద్గా మైదానాల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. - మెహిదీపట్నం

భద్రతా ప్రమాణాలు పాటించాలి

మెహిదీపట్నం, మార్చి 31 : రంజాన్ మాసంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ షాపింగ్ సౌకర్యవంతంగా చేసుకోవాలని దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దుకాణాల వారు వేళలను పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. గోషామహల్, కుల్సుంపుర, ఆసిఫ్‌నగర్, గోల్కొండ ఏసీపీ డివిజన్ల పరిధిలో ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. షాపింగ్ మాల్ యాజమాన్యాలు పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

ఛత్రినాక పరిధిలో కార్డెన్‌సెర్చ్

ఛత్రినాక పీఎస్ పరిధిలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, వంద మంది పోలీస్ సిబ్బందితో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా ఓ షాపులో విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు, మూడు కర్టెన్ల బీర్లు స్వాధీనం చేసుకున్నారు ఆపరేషన్‌లో ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ముగల్‌పుర డీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట, మార్చి 31